రేషన్‌కార్డులకు ఎదురుచూపులు

- ఆరేళ్లుగా లేని కొత్తకార్డులు
- కొత్తగా పెళ్లయిన వారితో పాటు, పుట్టిన పదేళ్ల పిల్లల పేర్లు కార్డుల్లో ఎక్కని పరిస్థితి
- ఆన్‌లైన్ చేసుకుని సిద్ధంగా ఉన్న వందలాది మంది లబ్ధిదారులు



ధరూరు: సామాన్య జనానికి ప్రధాన ఆధారమైన రేషన్‌కార్డు అందని ద్రాక్షలా మారింది. ఎనిమిదేళ్ల నుంచి ప్రభుత్వాలు కొత్త రేషన్‌కార్డుల ఊసే ఎత్తడం లేదు. పుట్టిన పిల్లలతో పాటు నూతనంగా పెళ్లయిన జంటలకు కార్డులు లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రేషన్ సరుకులతో పాటు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నా.. రేషన్‌కార్డే ప్రధాన ఆధరమైంది. ఎనిమిదేళ్లుగా కొత్తకార్డు జారీ చేయలేదు. కార్డులు ఉంటేనే ఆరోగ్యశ్రీ వంటి పథకాలు వర్తిస్తాయని అధికారులు చెబుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

అన్నింటికీ రేషన్‌కార్డే ఆధారం..

సగటు సామాన్య పౌరుడికి ఆధార్ ఎంత ముఖ్యమో రేషన్‌కార్డు కూడా అంతే ముఖ్యంగా కనిపిస్తోంది. మండలంలో రేషన్‌కార్డులు లేక నానా అవస్థలు పడుతున్నారు. పిల్లలకు 10 ఏళ్లు ఉన్నా రేషన్‌కార్డుల్లో పేరు లేకపోవడంతో రేషన్ సరుకులు ఇవ్వడం లేదు. పిల్లల పేర్లు కార్డుల్లో లేకపోవడంతో ఉన్నత చదువులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఉచిత ట్రీట్‌మెంట్ కోసం ఆస్పత్రులకు వెళ్తే పిల్లల రేషన్‌కార్డును అడుగుండటంతో ఏం చేయాలో తోచని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడిగా కార్డు జారీని విస్మరించిన ప్రభుత్వం కొత్త వారి గురించి పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త ప్రభుత్వం పైనే ఆశలు...

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో మండల ప్రజలు ఆశలన్నీ కొత్త ప్రభుత్వంపైనే పెట్టుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డుల జారీపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. మండలంలో మొత్తం 795 అంత్యోదయ కార్డులు ఉండగా.. ఆహార భద్రతకార్డులు 11,588 ఉన్నాయి. కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

భార్య పేరు రేషన్ కార్డులో లేదు..



మాది మధ్యతరగతి కుటుంబం. నాకు ఇటీవలే పెళ్లయ్యింది. నాకు సపరేట్ కార్డు లేదు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెబుతున్నారు. కానీ నాకు రేషన్ కార్డు లేనందున ఇబ్బంది అవుతోంది. స్వయం సహాయక సంఘంలో చేరేందుకు ఆ కార్డే అవసరమవుతోంది. నాకు కార్డు ఇవ్వాలి.

– విజయ్, ధరూరు

పిల్లల పేర్లు కార్డులో లేవు..



మాకు పెళ్లయి 15 ఏళ్లయ్యింది. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిలో పెద్ద అమ్మాయి పేరు మాత్రమే రేషన్‌కార్డులో ఎక్కింది. మిగిలిన ఇద్దరు పిల్లల పేర్లు మా కార్డులో ఎక్కలేదు. మూడేళ్ల కిందట ఆన్‌లైన్ చేయించినా కార్డులో ఎక్కలేదు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వమైనా చొరవ తీసుకుని సాధ్యమైంత త్వరగా కార్డులో పేర్లు చేర్చేలా చర్యలు తీసుకోవాలి.

– రమేష్, ధరూరు

ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో



మండలంలో ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో తెలియదు. ఆన్‌లైన్‌లో చేసుకున్న వివరాలు మా వద్ద ఉండవు.

– వహీదా ఖాతున్, తహసీల్దార్

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మానవపాడు: మండలంలోని ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో రిజిస్టర్లు అప్‌డేట్ చేయాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. శుక్రవారం మండలంలోని చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల హాజరు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. 100 శాతం జర్మినేషన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాగింగ్ పూర్తయిన నర్సరీలో విత్తనాలు వేయాలని సూచించారు. కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



గద్వాల న్యూటౌన్: గద్వాల మండల పరిధిలోని మదనపల్లిలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వ్యవసాయ శాఖ అధికారులు ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పోషన్ అభియాన్, ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కల్యాణ్ యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ఉన్న ప్రజలకు చేరుకోవాలన్నది యాత్ర ప్రధాన ఉద్దేశమని చెప్పారు. యూబీఐ మేనేజర్ రమస్మృతి, ఏఓ ఇందుజ, పంచాయతీ కార్యదర్శి సలేహ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయిచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని తెల్లవారుజామున 5 గంటల సమయంలో కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు శుక్రవారం ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లవారుజామున 5 గంటల సమయంలో వివిధ గ్రామాల నుంచి 20 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సేకరించి రాయిచూర్‌కు బొలెరో వాహనంలో తరలిస్తుండగా.. పెట్రోలింగ్ నిర్వహిస్తు వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు మండలంలోని మల్లాపురంతండా శివారులో పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు బియ్యం తరలిస్తున్న వారు పరారీలో ఉన్నట్లు వివరించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పరామర్శ

గట్టు: మండల పరిధిలోని బోయలగూడెం సర్పంచ్ రాణి భర్త వీరేష్‌గౌడ్‌ను శుక్రవారం జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం స్వగ్రామానికి చేరుకున్న వీరేష్‌గౌడ్‌ను జంబురామన్‌గౌడ్, విజయ్‌కుమార్ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఖాసీం, ముకన్న నాగరాజు, బడే సాబ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీయూ కార్యవర్గం ఎన్నిక



గద్వాల అర్బన్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం (ఎస్‌జీటీయూ) జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో న్యూహౌసింగ్ బోర్డు కాలనీలోని ఆ సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా సోమ సుందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడుగా ఎమినా నాయక్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, శ్రీధర్, కార్యదర్శిగా గోపాల్, వెంకటేశ్వర్ రెడ్డి, మహిళా విభాగం కార్యదర్శిగా శ్రీదేవిలను ఎన్నుకున్నారు. అనంతరం ప్రాథమిక విద్యా పరిరక్షణ, ప్రాథమిక పాఠశాలల బలోపేతం తదితర అంశాలపై చర్చించారు.

మెరుగైన విద్యాబోధనకు దోహదం

గద్వాల అర్బన్: విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించేందుకు తొలిమెట్టు ఎంతో దోహదపడుతుందని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి రాష్ట్ర స్థాయి పిల్లల కోసం తొలిమెట్టు బృందం సభ్యులు అస్త్ర ఫాతిమా, రొమిల జిల్లిలా, అబిజిత్ బిస్వస్ పాల్గొన్నారు. తొలిమెట్టు కార్యక్రమంపై ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. అదేవిధంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వెళ్లిన స్కూల్‌లో బోధన అనుభావాలు, విద్యార్థుల స్పందనలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు ఉన్నారు.



తొలిమెట్టు కార్యక్రమంపై వివరిస్తున్న తొలిమెట్టు రాష్ట్రస్థాయి బృందం సభ్యులు

భక్తులకు తాగునీటి వసతి ఏర్పాటు



మల్దకల్‌లో తాగునీటి ట్యాంకరును ప్రారంభిస్తున్న బ్యాంకు మేనేజర్

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా మల్దకల్ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ గంగాధరం ఆధ్వర్యంలో మూడు ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో మూడు తాగునీటి ట్యాంకర్లను మేనేజర్ గంగాధరం, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం ఈ మూడు ట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, రామక్రిష్ణ, ఆశన్న, రఘు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘అమ్మకు గౌరవం’ కేంద్రం ప్రారంభం



ఆత్మకూర్: వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అమ్మకు గౌరవం కేంద్రాన్ని వాసవీక్లబ్ గవర్నర్లు రామకృష్ణ, రమేష్‌శెట్టి ప్రారంభించారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని బస్టాండ్‌లో చంటి పిల్లలు తల్లులు పాలనిచ్చేందుకు ప్రత్యేక గది ఏర్పాటుతో అమ్మకు గౌరవం లభిస్తోందని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్, వనితాక్లబ్ నిర్వాహకులు నీలేష్, కల్వ రఘు, నవీన్, తాండూర్ పవన్ కుమార్, యెలిశెట్టి రాము, వీనశ్రీ, అర్చన, సుమశ్రీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు కల్వ రాజయ్య, వెంకటస్వామి, నాగరాజు, సిద్దేశ్వర్, రమేష్, సింగం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

శాంతినగర్: వడ్డేపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం వాయిదా పడింది. మండల పరిషత్ అధ్యక్షుడు రజిత అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో కోరం లేక ఎంపీడీఓ రవీంద్ర సమావేశాన్ని వాయిదా వేశారు. వచ్చే శుక్రవారం 29న సమావేశం నిర్వహిస్తామని, ఎంపీటీసీలందరూ హాజరుకావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరుకు చెందిన నవీన్ కుమార్ తన ఇంట్లోకి రాకుండా బెదిరింపులకు గురిచేసి దాడి చేసినట్లు ఫిర్యాదు ఇవ్వడంతో వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఈరన్న తెలిపారు. పుల్లూరుకి చెందిన సేవకుల నవీన్ కుమార్ ఈ నెల 21న ఉదయం 10 గంటల సమయానికి పంట పొలానికి వెళ్లి తిరిగి వచ్చేలోపు ఇంటి ముందు ఉన్న మెట్లను, కొళాయిని తొలగించి ఇంట్లోకి వెళ్తుండగా.. వెంకటయ్య గడ్డపార తీసుకుని దాడి చేయబోయాడు. దీంతో పారిపోయి ఫిర్యాదు చేశాడు. శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ ఈరన్న కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మంత్రులను కలిసిన ఏఐసీసీ కార్యదర్శి

అలంపూర్: బాధ్యతలు స్వీకరించిన మంత్రులను ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కలిసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయ చాంబర్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ నియోజకవర్గ నాయకులు సతీష్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, జగన్‌గౌడ్, లాల్‌గౌడ్, శశిధర్‌రెడ్డి శుక్రవారం కలిసినట్లు తెలియజేశారు.



చలిలో స్నానాలు చేస్తున్న బీసీ, ఎస్సీ, ఆనందనిలయం విద్యార్థులు

విరిగిన కిటికీలు.. చల్లని నీటి స్నానాలు

గద్వాల పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో నిరుపేద విద్యార్థులకు వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేడి నీటి సౌకర్యం లేకపోవడంతో చల్లని నీటితో స్నానాలు చేస్తున్నారు. పలుచోట్ల పగిలిన కిటికీలు, తలుపులకు అడ్డుగా తట్టు బొంతలు, గోనె సంచులు, టవాల్ ఏర్పాటు చేసుకున్నారు. చలి తీవ్రత, దోమల బెడదతో సతమతమవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు మాత్రం వసతిగృహాలపై కన్నెత్తి చూడటం లేదు. శీతాకాలానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడం లేదని వసతిగృహ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– గద్వాల అర్బన్



సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహంలో పగిలిన కిటికీలు

ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



అయిజలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం



వెంకటాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం

అయిజ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు దేవాలయాలను ముస్తాబు చేశారు. మండల కేంద్రంలో మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయం, మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.

చింతలముని ఆలయంలో ప్రత్యేక పూజలు

గట్టు: మండల పరిధిలోని చాగదొనలోని నల్లారెడ్డి చింతలముని ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా స్వామి ఆలయాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా మామిడి ఆకుల తోరణాలు, పూలతో అలంకరించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. చాగదోన గ్రామస్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త అభిలాష్ దంపతులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చాగదోనతో పాటుగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులతో చింతలముని ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో ధర్మకర్తలు నిజాంకారి మురళీధర్, చంద్రశేఖర్, నిర్వాహకులు రమేష్‌గౌడ్, పురషోత్తంగౌడుతో పాటుగా గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

కేటీదొడ్డి: వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని వెంకటాపురంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ఉదయం 6 గంటలకు ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ సంఖ్యలో భక్తులు రానున్న దృష్ట్యా బారికెడ్లు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పెద్దలు తెలిపారు.

నేడు అన్నమయ్య సంకీర్తనలు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని భూలక్ష్మీ చెన్నకేశ స్వామి సన్నిధిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక గాయకురాలు విజితగౌడ్‌చే అన్నమయ్య సంకీర్తనల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ విచారణ కర్త ప్రభాకర రావు, మేనేజర్ నరిహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎర్రవల్లికి చేరుకున్న అయోధ్యరామయ్య అక్షతలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయానికి శుక్రవారం అయోధ్య రామమందిరం నుంచి అక్షతలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వచ్చే నెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉన్నందున దేశంలోని ప్రతి హిందువు గడపకు అయోధ్య రామాలయం ట్రస్టు ఆధ్వర్యంలో అక్షతలు ఇక్కడికి వచ్చినట్లు బీజేపీ నేతలు తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో ప్రతి హిందువు గడపకు వాటిని పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దశరథ్, నాగరాజు, లోకారెడ్డి, శ్రీను, నర్సింహులు, రాజు, వీరన్న, కృష్ణమోహన్, తిమ్మన్న పాల్గొన్నారు.



ఆలయంలోకి అక్షతలను తీసుకొస్తున్న నాయకులు

గణితమంటే భయం వీడేలా బోధించాలి



ఉండవెల్లిలో సైకిల్ ఆకారంలో గణిత వస్తువులు



అయిజ: ఉత్తనూరులో అక్షరమాల ఆకారంలో విద్యార్థులు

అలంపూర్/ అయిజ/ మానవపాడు/ కేటీదొడ్డి/ ఉండవెల్లి/ శాంతినగర్/ ఎర్రవల్లిచౌరస్తా: గణితమంటే భయం వీడేలా ఉపాధ్యాయులు బోధించాలని కరస్పాండెంట్ రాఘవేంద్ర అన్నారు. కేటీదొడ్డి మండల పరిధిలోని నందిన్నె రాఘవేంద్ర పాఠశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటేష్, అంజలి, భారతి, నవిత, శిరీష, పావని తదితరులు పాల్గొన్నారు.

గణితంలో నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్

గణితంలో నైపుణ్యం సంపాదిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విశ్వశాంతి విద్యాలయాల సంస్థ కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి విద్యాలయాల్లో శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులు రామనుజన్ చిత్రపటాన్ని ముగ్గులతో వేసి రంగులతో తీర్చిదిద్దారు.



అలంపూర్ విశ్వశాంతి విద్యాలయాల్లో చిత్రపటాన్ని పరిశీలిస్తున్న మురళీధర్ రెడ్డి

- మానవపాడు మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతలు అందజేశారు. అమరేందర్‌రెడ్డి, వెంకన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ కాదు...గణిత పరికరాలు

గణిత దినోత్సవంలో భాగంగా ఉండవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గణిత వస్తువులతో పేర్చిన సైకిల్ కావడంతో చూసే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. గణిత ఉపాధ్యాయులు పలు రకాల ప్రయోగాలు చేసి చూయించారు.

అన్ని రంగాల్లో గణితానికి ప్రాముఖ్యత

అన్ని రంగాల్లో గణిత శాస్త్రానికి ప్రాముఖ్యత ఉందని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు.

- మల్దకల్ మండలంలో రామానుజన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



కేటీదొడ్డిలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



జల్లాపురంలో గణిత ఉపాధ్యాయుడికి బహుమతి అందజేస్తున్న సిబ్బంది



మల్దకల్ అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

ప్రభుత్వ పథకాల అమలులో వివక్ష

కొత్తకోట: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి వచ్చే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా డబ్బుల మంజూరులో వివక్ష చూపించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచాల యుగంధర్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచాల యుగంధర్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ వ్యవహారంలో వివక్ష చూపుతూ బీఆర్‌ఎస్‌కు చెందిన వారు సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎక్కువ డబ్బులు మంజూరు చేయించారన్నారు. ఇతర పార్టీల వారు దరఖాస్తు చేసుకుంటే తక్కువ డబ్బులు మంజూరు చేయించడమే కాకుండా మంజూరైన చెక్కులను బాధితులకు ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా ఉంటాయని, మాజీ ఎమ్మెల్యే మాత్రం తనకున్న అధికార పెత్తనంతో ఇష్టం వచ్చినట్టు వ్యవహరించారని ధ్వజమెత్తారు. గడిచిన తొమ్మిదేళ్లలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్ని శాఖల అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తనకు అనుకూలంగా ఉంచుకుని నియోజకవర్గంలో ఇష్టానుసారంగా వ్యవహారం చేశాడన్నారు. గొల్లబాబు, బాలస్వామి, రాజు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై బెంగళూర్ నుంచి హైదరాబాద్‌కు గణేష్ ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా ఇటిక్యాలపాడు శివారులోని ఘర్ దాబా వద్ద కుక్క అడ్డం రావడంతో కుక్కను ఢీకొట్టాడు. కుక్క మృతి చెందగా.. వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయాలైన వ్యక్తిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించినట్లు చెప్పారు.